సాక్షి
విశాఖపట్నం

సోమవారం : 22 : మే : 2023



మహానగర్ పథ సంచలనం

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో మహా నగర్ పథ సంచలనం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. 8లో



నృత్యసారూప్యం అద్వితీయం

కవల సోదరీమణుల నమ్మి యవనిక, యగ్ని కల కూచిపూడి రంగ ప్రవేశం కళాభారతిలో అద్భుతంగా జరిగింది. 10లో



జాతీయ స్థాయిలో..

వేసవి శిక్షణ అద్భుతంగా సాగుతోంది. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా యువతులు శిక్షణ పొందుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

అడ్వాన్స్‌డ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో హాజరుకానున్న 63,159 మంది ఇంటర్ విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జరగనున్న పరీక్షలకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 కేంద్రాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఫస్టియర్ జనరల్ 41,929 మంది, ఒకేషనల్ 2,633 మంది కలిపి మొత్తం 44,562 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. సెకండియర్ జనరల్ 16,979 మంది, ఒకేషనల్ 1,740 మంది కలిపి 18,719 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని, విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్కేబీచ్‌లో కొత్త ఆంక్షలు లేవు

అల్లిపురం: ఆర్కే బీచ్‌లో రాత్రి 10 గంటలకల్లా దుకాణాలు మూసివేయాలని.. పోలీస్ శాఖ కొత్త ఆంక్షలు పెట్టిందని సోషల్ మీడియా వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రాంతమైన ఆర్కేబీచ్ రోడ్‌లో షాపులు, ఇతర వ్యాపారాలు ఎప్పటిలాగానే యథాతథంగా ఉంటాయని పేర్కొన్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కృష్ణా జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ నుంచి తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభిస్తామన్నారు. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో సీట్లు భర్తీ చేయనున్నామన్నారు.

ప్రశాంతంగా ఎంఎస్ఎంఈ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహిస్తున్న అడ్వాన్స్ డిప్లమా ఇన్ డై-మౌల్డ్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ డిప్లమా ఇన్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంఎస్ఎంఈ సెట్-2023 ఆదివారం నిర్వహించారు. రెండు కోర్సుల్లో ప్రవేశాలకు విశాఖ, అనకాపల్లి, విజయవాడల్లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 328 మంది దరఖాస్తు చేయగా 297 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఏయూ నిర్వహించింది.

సబ్ రిజిస్ట్రార్లుగా రేవతి, కనకరత్నం



రేవతి, కనకరత్నం

జగదాంబ: చౌల్ట్రీ దరి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్లుగా రేవతి, కనకరత్నం నియమితులయ్యారు. ఇటీవల ఈ కార్యాలయంలో ఏసీబీ దాడులు జర్గ్గా సబ్ రిజిస్ట్రార్లు శ్రీనివాసరావు, గీతను బదిలీ చేశారు. వీరి స్థానంలో సబ్ రిజిస్ట్రార్-1గా రేవతి, సబ్ రిజిస్ట్రార్-2గా కనకరత్నం నియమితులయ్యారు.

ఏసీలో హాయ్ హాయ్!

- ఏసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు
- 80 శాతానికి పైగా చేరిన ఆక్యుపెన్సీ
- నాన్ ఏసీ సర్వీసులకు మించి ఓఆర్
- ఆర్టీసీకి ఊరటనిస్తున్న వేసవి తాపం



సాక్షి, విశాఖపట్నం: వేసవి తాపం తాట తీస్తోంది. ఎండ మంట పుట్టిస్తోంది. వడగాడ్పులు బేజారెత్తిస్తున్నాయి. ఇళ్లలో ఉంటేనే సెగలు కక్కుతున్నాయి. ఇక ప్రయాణాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఒకపక్క స్కూళ్లు, కాలేజీలకు సెలవులొచ్చాయి. మరోపక్క పెళ్లిళ్లు కూడా ఊపందుకున్నాయి. దీంతో ఊళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారి సంఖ్య అధికమైంది. ఇలా ఊళ్లు వెళ్లే వారు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి ఏసీ బస్సుల్లో ప్రయాణాలకు మొగ్గు చూపుతున్నారు. మధ్య తరగతి, ఆపై స్థాయి ప్రయాణికులు నాన్-ఏసీ ప్రయాణంకంటే ఏసీ బస్సుల్లో ఎక్కువ చార్జీ అవుతున్నప్పటికీ వెనకడుగు వేయడం లేదు. ఫలితంగా ఆర్టీసీతో పాటు ప్రైవేటు ఏసీ బస్సుల్లోను సీట్లు, బెర్తులకు డిమాండ్ పెరుగుతోంది. గత నెలలో ఏపీఎస్ఆర్టీసీ ఏసీ సర్వీసుల్లో 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉండగా ఇప్పుడది 80 శాతానికి పైగా చేరుకుంది. అదే సమయంలో నాన్-ఏసీ సర్వీసులకు కూడా ఓఆర్ పెరిగినా ఏసీ సర్వీసులతో పోల్చుకుంటే తక్కువగానే ఉంటోంది. గత నెలలో నాన్-ఏసీ బస్సుల్లో ఓఆర్ 60 శాతం ఉండగా ప్రస్తుతం 75 శాతం వరకు పెరిగింది.

అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం ఆక్యుపెన్సీ

విశాఖ జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది చొప్పున వెళ్తున్నాయి. ఇవన్నీ 80 శాతం పైనే ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వీటిలో అత్యధికంగా విశాఖపట్నం నుంచి అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం, ఆ తర్వాత స్థానంలో విశాఖ నుంచి కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు నడిచే మెట్రో లగ్జరీకి 85 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉంటోంది. అలాగే 84 శాతం ఓఆర్‌తో విజయవాడ అమరావతి సర్వీసుకు, 82 శాతం ఓఆర్ కడప ఇంద్ర ఏసీ సర్వీసుకు ఉంది. సగటున 80 శాతానికి మించి ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ లభిస్తుండడం ఆర్టీసీకి ఊరటనిస్తోంది. ఈ వేసవిలో ఏసీ బస్సుల్లో ప్రయాణాలు ఆశాజనకంగా పెరిగాయని, ఇది ఆర్టీసీకి లాభదాకమని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. గత నెలతో పోల్చుకుంటే వీటిలో ఓఆర్ పెరుగుదల బాగుందని తెలిపారు.

ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంట

వేసవి తాపం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు కాసులు కురిపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఏసీ టికెట్లకు డిమాండ్ అధికమవుతోంది. దీనిని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఏసీ స్లీపర్ విశాఖపట్నం నుంచి విజయవాడకు రూ.1700-2200 వరకు, హైదరాబాద్‌కు రూ.2500 నుంచి 3200 వరకు వసూలు చేస్తున్నారు. అదే సీటయితే విజయవాడకు రూ.1300-1500, హైదరాబాద్‌కు డిమాండ్‌ను బట్టి రూ.2000-2500 వరకు తీసుకుంటున్నారు.

ఆర్టీసీ ఏ రూటు బస్సుకు ఎంత ఆక్యుపెన్సీ (శాతంలో)

సర్వీసు	ఎక్కడకు	ఓఆర్
వెన్నెల	విశాఖ-హైదరాబాద్	80
డాల్ఫిన్ క్రూయిజ్	విశాఖ-హైదరాబాద్	76
నైట్ రైడర్ (స్లీపర్)	విశాఖ-హైదరబాద్	80
అమరావతి	విశాఖ-విజయవాడ	84
ఇంద్ర	విశాఖ-కడప	82
ఇంద్ర	విశాఖ-అమలాపురం	87
మెట్రో లగ్జరీ	విశాఖ-కాకినాడ	85
మెట్రో లగ్జరీ	విశాఖ-రాజమండ్రి	85
మెట్రో లగ్జరీ	విశాఖ-శ్రీకాకుళం	85

తీర స్వచ్ఛత అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ తదితరులు

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- మెగా బీచ్ క్లీనింగ్‌కు విశేష స్పందన

బీచ్‌రోడ్డు : సముద్ర తీర ప్రాంతాలు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛత జన్‌భాగీదారి, సాగరతీర స్వచ్ఛత ఇండియా జీ-20 ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్‌లో మెగా బీచ్‌క్లీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సముద్రతీర ప్రాంతాలు కలుషితం అవుతున్నాయని, వాటిపై దృష్టిసారించాలన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు బీచ్ క్లీనింగ్ చేపట్టినట్లు తెలిపారు. తీరానికి సందర్శనకు వస్తున్న వారు వ్యర్థాలను జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



చెత్త సేకరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ సాగర తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీసీపీ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడికి చేరేలా..!

- అమ్మఒడి జాబితాపై సచివాలయ స్థాయిలో సమగ్ర పరిశీలన
- బడితెరిచిన మరుసటి రోజునే ఖాతాల్లోకి డబ్బులు
- జిల్లాలో గతేడాది 1,75,065 మందికి రూ.262.79 కోట్లు పంపిణీ
- ఈ ఏడాది పెరగనున్న లబ్ధిదారులు



విశాఖ విద్య: అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మ ఒడి పథకం నాలుగో ఏడాది కూడా సకాలంలో అందించేలా కసరత్తు జరుగుతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో బడులు తెరిచిన మరుసటి రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసేలా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 1,75,065 మందికి రూ. 262.59 కోట్లు అందించారు. ఇందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,49,120 మందికి రూ.223.68 కోట్లు, ఇంటర్ 25,945 మందికి రూ. 38.92 కోట్లు పంపిణీ చేశారు. ఈ ఏడాది మరింత మందికి ప్రయోజనం చేకూర్చేలా విద్యాశాఖాధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు. అర్హులైన ఏ ఒక్క విద్యార్థికి పథకం అందలేద నే మాట రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

సచివాలయాల్లో జాబితాలు

చైల్డ్ ఇన్ఫోతో అనుసంధానమై ఉన్న అమ్మ ఒడి పథకం లబ్ధిదారుల జాబితాలు ఈ నెల 25న జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించుకునే అవకాశం కల్పిస్తున్నారు. పాఠశాల హెచ్ఎం లాగిన్‌లో కూడా జాబితాలు అందుబాటులో ఉంటాయి. ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమకానున్నాయి. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా సచివాలయ విద్యా కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు.

అర్హులకే అమ్మ ఒడి

వెబ్‌సైట్‌లో ఉన్న జాబితా మేరకు సచివాలయ విద్యాకార్యదర్శి లబ్ధిదారుల బయోమెట్రిక్ అథంటికేషన్(ఈకేవైసీ) చేయనున్నారు. జాబితాను పరిశీలన చేసి, అన్నీ సవ్యంగా ఉన్నాయా లేదా అనేది ధ్రువీకరించనున్నారు. ఆధార్ కార్డు వేర్వేరు బ్యాంకు అకౌంట్లతో అనుసంధానమై ఉంటే, సాంకేతిక సమస్యల తలెత్తి డబ్బులు జమ కావు. ఈ కారణాల వల్లనే గతంలో అర్హులైనప్పటికీ కొంతమందికి డబ్బులు అందలేదు. ఇలాంటి సమస్యలను కూడా సచివాలయ స్థాయిలోనే పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నెల 25 నాటికి జాబితాకు తుదిరూపు తీసుకొచ్చేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విశాఖలో విద్యుత్ ఆదా భవనం

- ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) నిర్మాణానికి అనుమతులు
- రూ.10 కోట్లతో దేశంలో మూడో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- సగానికిపైగా విద్యుత్ ఆదా చేసేలా సూపర్ ఈసీబీసీ భవనానికి ప్రణాళికలు
- సాగర్ నగర్‌లో చురుగ్గా నిర్మాణ పనులు



సాగర్ నగర్‌లో నిర్మితమవ్వనున్న సూపర్ ఈసీబీసీ భవనం ఇదే

సాక్షి, విశాఖపట్నం : పర్యావరణ నిర్మాణాలకు విశాఖలో అంకురార్పణ జరుగుతోంది. విద్యుత్ వినియోగాన్ని సగానికిపైగా తగ్గిస్తూ.. ఇంధన వనరుల ఆదాపై దృష్టిసారించిన ప్రభుత్వం.. ఏపీలో తొలి సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్‌ను నిర్మిస్తోంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) సహకారంతో విద్యుత్ ఆదా భవనం సాగర్ నగర్ వద్ద రూపుదిద్దుకుంటోంది. రూ.10 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ భవనం ద్వారా 50 శాతం వరకూ విద్యుత్ ఆదా జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ) భవనాన్ని విశాఖలో నిర్మిస్తున్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) ఈ ఈసీబీసీ బిల్డింగ్‌కు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. దేశంలో మూడో సూపర్ ఈసీబీసీ భవనంగా చరిత్ర సృష్టించనుంది.

సాగర్ నగర్‌లో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా..

సూపర్ ఈసీబీసీ-2017 నిబంధనలకు అనుగుణంగా సాగర్ నగర్‌లో ఈ నిర్మాణం ప్రారంభమైంది. జీ ప్లస్ 1 మోడల్‌తో ఈ ప్రతిపాదిత 'ఈపీడీసీఎల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్' భవనాన్ని ఎంపిక చేశారు. రూ.10 కోట్లకుపైగా ఖర్చు చేయనున్న ఈ భవన నిర్మాణ వ్యయంలో 50 శాతం నిధులు బీఈఈ మంజూరు చేస్తుండగా.. మిగిలిన మ్యాచింగ్ గ్రాంట్‌ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. సూపర్ ఈసీబీసీ భవనాలు.. సాధారణ ఈసీబీసీ భవనాల కంటే మరింత సమర్థవంతంగా ఉంటాయి.

సాధారణ ఈసీబీసీ భవనాలు 25 శాతం తక్కువ విద్యుత్‌ని వినియోగిస్తే.. సూపర్ ఈసీబీసీ భవనాలు మాత్రం ఏకంగా 50 శాతం విద్యుత్‌ని ఆదా చేస్తాయి. భవన నిర్మాణ క్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారిస్తారు. సోలార్ లేదా విండ్ పవర్‌ని జోడిస్తారు. కాబట్టి.. పూర్తిగా సున్నా విద్యుత్ వినియోగం జరిగే అవకాశాలున్నాయి. దానికనుగుణంగా భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికల్ని ఈపీడీసీఎల్ రూపొందించుకుంది. మారుతీ ఇంజినీరింగ్ సంస్థకు ఈ భవన నిర్మాణ పనుల్ని ఈపీడీసీఎల్ అప్పగించింది. ఏడాది కాలపరిమితిలో దీన్ని పూర్తి చేసేందుకు టైమ్ లైన్ ఏర్పాటు చేసుకున్నారు.

దేశంలోనే తొలిసారిగా..



ఏపీలో తొలి సూపర్ ఈసీబీసీ భవనంగా విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ బిల్డింగ్ మొత్తం దేశానికి నమూనా ప్రదర్శనగా మారనుంది. అత్యాధునిక సాంకేతికతలతో భవన నిర్మాణం జరిగేలా ఈపీడీసీఎల్ చర్యలు తీసుకుంటోంది. ఆర్కిటెక్చరల్ డిజైన్‌ఫీచర్స్ ద్వారా విద్యుత్‌వినియోగాన్ని ఆప్టిమైజేషన్ చేసిన తర్వాత సూపర్ ఈసీబీసీ బిల్డింగ్‌లో టెక్నాలజీ మిళితమై ఉంటుంది. దీంతో పాటు రెన్యూవబుల్ ఎనర్జీ వినియోగానికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో

విభిన్న ప్రణాళికలు



సాగర్ నగర్‌లో రూపుదిద్దుకుంటున్న తొలి సూపర్ ఈసీబీసీ భవన నిర్మాణంపై ఉన్నతాధికారుల మార్గదర్శకాలను అనుసరించి ప్రత్యేక చర్యల్ని అవలంబిస్తున్నాం. దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళిక రూపొందించాం.

– ఏవీవీ సూర్య ప్రతాప్, ఈపీడీసీఎల్ డైరెక్టర్(ప్రాజెక్టు)

చిట్టి చేతులు చక్కని చిత్రాలు



చిత్ర లేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఉత్సాహంగా సాక్షి చిత్రలేఖన పోటీలు

సీతంపేట: చిట్టి మెదళ్లలో ఆలోచనలకు రంగులద్ది అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. 'నీటిని ఎలా ఆదా చేయాలి' అంశంపై చిన్నారులు గీసిన చిత్రాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. విశాఖ నగర అందాలను పిల్లలు తమ కాన్వాసులపై అద్భుతంగా తీర్చిదిద్దారు. సాక్షి ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన బాలలకు చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగంలో రెండు కేటగిరిల్లో పోటీలు జరిగాయి. 10 ఏళ్లలోపు జూనియర్స్‌కు 'సేవ్ వాటర్ థీమ్', 10 నుంచి 16 ఏళ్లలోపు సీనియర్ విభాగం విద్యార్థులకు 'బ్యూటీ ఆఫ్ వైజాగ్' థీమ్‌పై చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ చక్కటి థీమ్‌తో చిత్రలేఖన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా మంచి కార్యక్రమం చేపట్టిన సాక్షిని అభినందించారు. భవిష్యత్తులో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ చదువుతోపాటు పిల్లలకు నచ్చిన ఏదో ఒక అంశంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు. సీనియర్, జూనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు, 10 మందికి కన్సొలేషన్ బహుమతులు, మరో 10 మందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీనియర్ డ్రాయింగ్ టీచర్లు కనుమూరి శ్రీనివాసరావు, భాగవతుల శంకరరావు, పిడమర్తి సుధాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇంచార్జి కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి టీవీ బ్యూరో ఇంచార్జి రామచంద్రరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కన్సొలేషన్ బహుమతులతో చిన్నారులు

విజేతలు వీరే..

జూనియర్ విభాగంలో...

మొదటి బహుమతి ఎం.ప్రేమ్ సాత్విక్ (థర్డ్ క్లాస్, కొటక్ స్కూల్), ద్వితీయ బహుమతి బి.హనీష్ కృష్ణారెడ్డి (ఐదో తరగతి, సెయింట్ ఆన్స్ స్కూల్), తృతీయ బహుమతి ఎం.అన్విత (4వ తరగతి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్)

కన్సొలేషన్ బహుమతులు

వి.హన్సిక, షహింజ్ తబస్సుం, కె.శ్రీ సమన్విత, జె.లక్ష్మీచైత్ర, ధరణ్ వెరోనిక, ఒమ్మి జోహిత, ఎస్.కోశల్, వి.బి.ఎస్.లక్షిత, పి.హరిత, డి.హరిశ్రిత.

సీనియర్ విభాగంలో..

మొదటి బహుమతి ఎం.హారిక (శ్రీచైతన్య స్కూల్), ద్వితీయ బహుమతి పూర్వి రజాక్ (లిటిల్ ఏంజిల్స్) తృతీయ బహుమతి సిహెచ్.భావజ్ఞ (శ్రీప్రకాష్).

కన్సొలేషన్ బహుమతులు

వి.ధనుజ సుకన్య, ఎస్.చారుశ్రీ, దీక్ష వాక, అక్షర్ మేధ, బి.షణ్ముక శ్రీ, ఎ.లోకేశ్వరి, కె.మానస, కె.ఎల్.అనూష, ఎం.రోషన్ కార్తికేయ, బి.గాయత్రి.



నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మేయర్ హరివెంకట కుమారి చేతుల మీదుగా సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న ఎం.హారిక, పూర్వి రజాక్, భావజ్ఞ, జూనియర్ విభాగంలో ప్రేమ్ సాత్విక్, హనీష్ కృష్ణారెడ్డి, అన్విత (కుడి నుంచి ఎడమకు)

డీఈఈకి రిమాండ్

- ఆదివారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచిన అధికారులు
- రెండో రోజు కొనసాగిన ఏసీబీ సోదాలు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోట్ల సన్ని రాంబాబుకు ఈ నెల 29వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. భారీగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. అతడిని ఆదివారం విశాఖ ఏసీబీ కోర్టులో హాజరు పరచగా ఎనిమిది రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఇది ఇలా ఉండగా అడిషనల్ ఎస్పీ కె.శ్రావణి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు సతీష్‌కుమార్, ప్రేమ్‌కుమార్, కిశోర్‌కుమార్, విజయకుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు, మహేష్‌లు ఆదివారం కూడా సోదాలు నిర్వహించారు. పలు బ్యాంక్‌ల పాస్‌బుక్‌లు, పత్రాలు పరిశీలించారు.

విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తులు

ఎంవీపీకాలనీ: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలు లోపు ఉండాలి. వీరికి పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సుల్లో చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. అంతర్జాతీయంగా టాప్ 50 విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే వెసులుబాటు ఉంది. క్వాలిఫైయింగ్ కోర్సుల్లో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు అర్హులు. ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకొనే ఇంటర్మీడియేట్ విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. అర్హులైన విద్యార్థులు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

యోగాతో మనసు ప్రశాంతత



యోగా శిక్షణా శిబిరంలో పాల్గొన్న చిన్నారులు, యువతతో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, డివిజన్ అధికారులు, ఈకార్వో ప్రతినిధులు

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి
- ముగిసిన యోగా ఫర్ యూత్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : యోగ మనసును, ఆత్మను అదుపులో ఉంచడానికి సహకరిస్తుందని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ఆధ్వర్యంలో ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన యోగా ఫర్ యూత్ శిక్షణా శిబిరానికి అద్భుత స్పందన వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మే 15వ తేదీ నుంచి వారం రోజుల పాటు రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో జరిగిన ప్రత్యేక యోగా శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనూప్‌కుమార్ సత్పతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సమర్థవంతమైన కళ అని, ప్రతీ చిన్నారి విజయవంతమైన జీవితాన్ని కొనసాగించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. శిక్షణా శిబిరంలో యోగాసనాలు నేర్పించిన ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ దైనందిన జీవితంలో నేటి యువత మనసులో అనవసరమైన ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయన్నారు. యువత ఎల్క్ట్రానిక్ పరికరాలను ఎక్కువగా వినియోగించడం వలన వారి బంగారు జీవితాలను నాలుగు గోడల మధ్య బంధించుకుంటున్నారని తెలిపారు. యోగాతో పాటు ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యోగా శిక్షకులకు డీఆర్ఎం చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. యోగా గురులను కూడా ఘనంగా సత్కరించారు. 12 నుంచి 18 ఏళ్ల గల సుమారు 150మంది బాలబాలికలు, యువత ఈ క్యాంప్‌లో పాల్గొన్నారు.

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా..



నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న స్టేట్ క్రీడాకారిణులు

- క్రికెట్‌లో యువతులకు శిక్షణ
- లాంగ్‌టర్మ్ కోచింగ్
- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు
- మూడు మైదానాల్లో తర్ఫీదు

విశాఖ స్పోర్ట్స్ : వేసవి శిక్షణ అద్భుతంగా సాగుతోంది. మహిళా క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో శిక్షణ ఇస్తున్నారు. విశాఖనుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుకున్న స్నేహదీప్తి, షబ్నమ్‌లు వేసవి శిక్షణను ఉపయోగించుకునే ఎదిగారు. సత్తాచాటుకున్నారు. దీంతో యువతుల్లో క్రికెట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. స్నేహదీప్తి, షబ్నమ్‌లను స్ఫూర్తిగా తీసుకుని క్రికెట్‌లో ప్రతిభ చాటుకునేందుకు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. జాతీయ స్థాయికి ఆడేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ట్రైనర్స్ కూడా పట్టుదలతో ఉన్నారని వీడీసీఏ సంయుక్త కార్యదర్శి, వేసవి శిబిరాల సమన్వయకర్త జేకేఎం రాజు చెబుతున్నారు. బాలికలకు శిక్షణా శిబిరాలను ఏడేళ్ల క్రితం ప్రారంభించామని తెలిపారు. మరో ఐదుగురిని జాతీయజట్టుకు ఎంపికయ్యే విధంగా శిక్షణ కొనసాగిస్తున్నామమని, వారంతా ప్రస్తుతం ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రస్తుత వార్షిక శిక్షణా శిబిరంలో బాలుర, బాలికలతో సహా మొత్తంగా షార్ట్‌లిస్ట్‌చేసి 250 మందిని ఎంపిక చేశారు. వీరంతా శిక్షణ పొంది లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు సిద్ధం కానున్నారు.

అలుపెరుగని విధంగా..

వేసవి శిబిరాల్లో భాగంగా నాలుగు వేదికల్లో వీడీసీఏ శిక్షణ ఇస్తోంది. ఉక్కుస్టేడియం, మున్సిపల్ స్టేడియంలతో పాటు వైఎస్సార్ స్టేడియం-బి గ్రౌండ్‌లోనూ శిక్షణ ఇస్తున్నారు. ఎంపికైన 60మంది బాలికలతో పాటు ఇప్పటికే పలు స్థాయిలో ఆంధ్రకు ఆడిన 20మందితో కలిపి శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఎనిమిది మంది -16 స్టేట్ ఆడగా, ఏడుగురు -19స్టేట్ ఆడారు. మరో ఐదుగురు సీనియర్ స్టేట్ ఆడారు. వీరందరితో పాటు ఇప్పుడు శిక్షణ తీసుకున్న వారినీ కలిపి శిక్షణ అనంతరం జట్లుగా మ్యాచ్‌లాడించేందుకు సిద్ధం చేస్తున్నారు.

శిక్షణ ఇలా....

బాలికలకు అండర్ 12నుంచి అండర్ 16వరకు వైఎస్సార్ స్టేడియం వేదికగానే రెండు సెషన్స్‌లో సాగుతోంది. ఉదయం సెషన్‌లో ఫిట్‌నెస్, ఫీల్డింగ్ అంశాల్లోనే శిక్షణ జరుగుతుండగా సాయంత్రపు సెషన్‌లో నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. కొత్తగా శిక్షణలో చేరిన వారికి బేసిక్స్‌తో పాటు టెక్నిక్ నేర్పించిన వారి వ్యక్తిగత ప్రతిభను ఆధారంగా ఇప్పటికే స్టేట్ ఆడిన వారితో కలపనున్నారు. జట్లుగా ఏర్పాటు చేసి మ్యాచ్‌లు నిర్వహించి లాంగ్‌టర్మ్ శిక్షణకు తీసుకోనున్నారు. వేసవి శిబిరాలు ప్రారంభించిన రెండేళ్లలోనే జిల్లా జట్టుకు ఎంపికై స్టేట్ ఆడిన వారూ ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. వీరినుంచే తన్మయ్, హర్షిత, హేమరోషిణి, మహతి లాంటి వారు జాతీయ క్రికెట్ అకాడమికి వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.



బౌలింగ్ ప్రాక్టీస్

166 నాటౌట్



2016లో మా మామయ్య ద్వారా శిక్షణకు వచ్చాను. ఇండియాకు ఆడిన స్నేహదీప్తి నా బంధువు. అలా క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నా. విజయనగరంతో జరిగిన మ్యాచ్‌లో 166పరుగులు చేశా. తొలుత కాజువల్‌గానే వేసవి శిబిరంలో పాల్గొన్నా లాంగ్‌టర్మ్‌తో జిల్లా జట్టుకు ఎంపిక కావడడంతో అండర్16, సీనియర్ స్టేట్ ఆడా.. హయ్యర్ లెవెల్ క్రికెట్ ఆడాలన్నదే నా ధ్యేయం.

-హర్షిత, లెఫ్టార్మ్ బ్యాటర్

ఆంధ్రా జట్టు వైస్ కెప్టెన్‌గా..



ఐదో తరగతిలో ఉండగా నాన్నతో కలిసి శిబిరానికి వచ్చాను. అలా ఆడుతూనే ప్రొఫెషనల్‌గా మారిపోయాను. ప్రస్తుతం జట్టుకు ఓపెనింగ్ బ్యాటర్‌గా ఎదిగాను. బ్యాటింగ్ అనేది నా ఆప్షనే. చాలెంజర్ ట్రోఫీ ఆడా. నేషనల్ క్రికెట్ అకాడమిలో కాంప్ చేసి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గాను వ్యవహరించా. రాజ్‌కోట్‌లో జరగనున్న మ్యాచ్‌లకు ఆంధ్రజట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాను. -**మహతి**, జాతీయ అకాడమిలో శిక్షణ పొందుతున్న యువతి

ఆంధ్ర -19 కెప్టెనయ్యా...



2016లో జరిగిన వేసవి శిబిరంలో శిక్షణ పొందా. ఆ తర్వాత రెండేళ్లు ఆడలేదు. తిరిగి 2019నుంచి లాంగ్‌టర్మ్ కోచింగ్‌తో అండర్16 స్టేట్‌కు ఆడాను. తర్వాత ఏడాది స్టేట్‌కు ఆడి అండర్ 19కి వచ్చాను. ప్రస్తుతం అండర్-19 కెప్టెన్‌గా ఆంధ్ర వుమెన్ జట్టును నడిపించనున్నాను. కెప్టెన్‌గా ఆటగాళ్లను అందరినీ సమన్వయం చేసుకుంటూనే జాతీయజట్టుకు ఆడాలన్నదే నా కల.

-సాయితన్మయి, -19 ఆంధ్ర మహిళా కెప్టెన్

ప్రతీ మ్యాచ్‌ను రివ్యూ చేసుకుంటా..



2019లో శిక్షణకు వచ్చాను. తమ్ముడూ క్రికెటరే. అప్పట్లో బ్యాడ్మింటన్ ఆడేదాన్ని. జూనియర్ ఇండియా స్థాయికి ఎదిగినా క్రికెట్ వైపు వచ్చాను. అందుకు వీడీసీఏనే కారణం. ప్రోత్సహించడంతోనే నేరుగా అండర్19స్టేట్ ఆడాను. గతేడాది సీనియర్ స్టేట్ ఆడాను. వాస్తవంగా మాది ఉత్తరప్రదేశ్ అయినా నాన్న నేవీలో చేస్తూ ఇక్కడే స్థిరపడిపోయాం. ఆడేప్పుడు మ్యాచ్‌ల్లో చేసిన పొరపాట్లను సీనియర్స్‌తో డిస్కస్ చేస్తూ బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నా. జాతీయజట్టుకు ఆడాలన్నదే కోరిక.

-ఆయేషాసింగ్, ఆల్‌రౌండర్

ఆడే స్థాయిని బట్టే గుర్తింపు



ఏసీఏ పరిధిలోని 13 జిల్లాల్లో ఏటా వేసవి శిబిరాలు జరుగుతున్న వారిని లాంగ్‌టర్మ్ వరకూ ప్రోత్సహించేది వీడీసీఏనే. శిబిరాల నుంచి శిక్షణ పొంది నేడు 364మంది వివిధ స్థాయి ఏజ్ గ్రూప్‌ల్లో ఆడుతున్నారు. అటు వీడీసీఏ ఉపాధ్యక్షుడిగా యాక్టివిటీస్ మానిటర్ చేస్తూనే కంపెనీ తరపున స్పాన్సర్‌గా శిబిరం నిర్వహిస్తున్నా..వేసవి శిబిరం అనేది జిల్లా నుంచి జాతీయ జట్టు వరకు ఒక ప్లాట్‌ఫాం లాంటిది. వారి ప్రదర్శన బట్టి.. వారు ఆడే స్థాయి నిర్ణయిస్తారు.

-డీవీఎస్ వర్మ, వీడీసీఏ ఉపాధ్యక్షుడు

ఎల్‌ఐసీ రక్షణకు పోరాటం

డాబాగార్డెన్స్ : పటిష్టంగా ఉన్న ఎల్‌ఐసీని ఐపీఓ పేరిట ప్రైవేట్‌పరం చేసే దిశగా తీసుకెళ్లి, కార్పొరేట్ కంపెనీలకు ఎల్‌ఐసీని కట్టబెట్టే విధానాలను కేంద్రం అవలంబిస్తోందని ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ఎల్ మంజూనాథ్, ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు ఆరోపించారు. సేవ్ ఎల్‌ఐసీ-ప్రొటెక్ట్ ఏజెంట్స్ నినాదంతో నిరంతరం పోరాడుతున్న ఎల్‌ఐసీఏఓఐ (ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) 5వ జోనల్ మహాసభ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఐఆర్‌డీఏఐ డ్రాఫ్ట్ 'బీమా సగం' మొదలగు విధానాలు ప్రవేశపెట్టి ఎల్‌ఐసీతో పాటు ఎల్‌ఐసీ ఏజెంట్ల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులను కొంత మంది కార్పొరేట్ చేతుల్లో పెట్టి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఈ విధానాల వల్ల సామాన్య ప్రజలకు ఎంతో నష్టం వాటిల్లనుందని చెప్పారు. దీనిలో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా పోరాటం చేస్తున్న కార్మిక సంఘాలకు సంఘీభావం తెలియజేస్తూ..ఈ పోరాటంతో ఎల్‌ఐసీఏఓఐ కూడా పాల్గొంటుందని చెప్పారు. సోమ,మంగళవారాల్లో 6వ అఖిల భారత మహాసభ విశాఖలోనే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మహాసభలు ఏజెంట్ల భవిష్యత్ కార్యాచరణకు దిక్సూచి కాగలదని ఆయన తెలిపారు. మహాసభల్లో భాగంగా సోమవారం వేలాది మంది ఎల్‌ఐసీ ఏజెంట్లు, ఉద్యోగులు, పాలసీదారులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బహిరంగ సభను కేరళ మాజీ ఫైనాన్స్ మంత్రి తోమస్ ఐశాక్ ప్రారంభించనున్నారని, అంతేగాక ఎల్‌ఐసీ ఏఓఐ అఖిల భారత అధ్యక్షుడు బాసుదేవ్ అచార్య, మాజీ ఎంపీ డాక్టర్ ఏ సంపత్ పాల్గొని ప్రసంగించనున్నారని చెప్పారు. ఆలిండియా మహాసభ డెలిగేట్స్ మీటింగ్‌ను సిటూ నేషనల్ సెక్రటరీ కేఎస్ ఉమేష్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జి.కిషోర్, ఎస్ఆర్ టాగూర్, జీవీవీఎస్ఆర్‌కే చారి, టి. కోటేశ్వరరావు, కె.ఎం. శ్రీనివాస్, ఎం.కామేశ్వరి, ఎం.నాగరాజు, ఆంజనేయులు, సూర్యారావు, రామకృష్ణ, రాజా, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

'న్యూసెన్స్'ను ఆదరిస్తున్నందుకు థ్యాంక్స్

- హీరో నవదీప్

అల్లిపురం : న్యూసెన్స్ వెబ్‌సిరీస్ అన్ని వర్గాల వారిని విశేషంగా ఆకట్టుకుందని హీరో నవదీప్ తెలిపారు. నగరంలో గోకుల్ థియేటర్‌లో పాత్రికేయులకు, మరికొందరు ప్రముఖుల కోసం ప్రత్యేకంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన ప్రీమియర్ షోలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ప్రవీణ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందించిన న్యూసెన్స్ ఘన విజయం సాధించిందన్నారు. సోషల్ మీడియాలో, అనేక వెబ్‌సైట్లలో చక్కటి రేటింగ్ ఇవ్వడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. హిట్ టాక్ వచ్చిన తరువాత సక్సెస్ మీట్ చేసుకోవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. విశాఖ వచ్చి ప్రేక్షకులతో కలిసి వెబ్ సిరీస్ చూడడం చూడడం ఎంతో థ్రిల్ కలిగించిందన్నారు. త్వరలో లవ్ మౌళి అనే కొత్త ప్రేమ కథాంశంతో ప్రేక్షకుల ముందు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మాస్ మహారాజ్ రవితేజతో కూడా ఒక సినిమాలో నటిస్తున్నట్లు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న నవదీప్

విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ఇక్కడ అందాలకు ఎప్పుడూ ప్రత్యేకమేనన్నారు. హీరోయిన్ బిందుమాధవి ఈ చిత్రంలో చక్కగా నటించిందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి అన్ని విధాల సహకరించిన ఓటీటీ సంస్థ ఆహాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వెలమ కమ్యూనిటీహాల్‌కు గ్రీన్ సిగ్నల్



మాట్లాడుతున్న వెలమ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: జిల్లాలో వెలమ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయింపు పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు 0.50 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ మల్లికార్జునకు ప్రభుత్వం సూచించింది, ఈవిషయమై జీవో విడుదల చేసింది. పెందుర్తి నియోజకవర్గం చిన్నముషిడివాడలో స్థల సేకరణకు పరిశీలన చేయాలని కలెక్టర్, పెందుర్తి తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వెలమ భవన్‌లో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చిన్నబాబు, కార్యదర్శి బండారు రామకృష్ణ, కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలమ సామాజికవర్గం కమ్యూనిటీ అవసరాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వెలమ ప్రజా ప్రతినిధుల ద్వారా వినతిపత్రాలను సమర్పించామని, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి స్థల సేకరణకు ఆదేశాలు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ కమిటీ ఉపాధ్యక్షులు, సభ్యులు సిరికి పోతురాజు, రొంగలి వెంకట త్రినాథరావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ మిడతాన బాపునాయుడు, సిరికి కొండలరావు, సింగంపల్లి రమణబాబు, మీడియా కన్వీనర్ తమటపు కృష్ణమూర్తి నాయుడు, జగ్గారావు, ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య సమ్మేళనం



శివమంజరి, నాట్యపరిమళ సత్కారం పొందిన గురువులు, శిష్యులు



విశాఖ నగరానికి చెందిన కళాకారులు

డాబాగార్డెన్స్: శ్రీవరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాల, నాట్య దీపిక కూచిపూడి అకాడమీ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన వేసవి నృత్య సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. ఈ సమ్మేళనానికి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, కాకినాడ, కరింనగర్, తెలంగాణ నుంచి పలువురు గురువులు వారి వద్ద శిక్షణ పొందినవారితో పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గురువులకు శివమంజరి, శిష్యులకు నాట్యపరిమళతో సత్కరించారు. డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, డాక్టర్ తాళ్లపాక సందీప్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కళ అందరికీ అందుబాటులో ఉండాలన్నదే వేసవి నృత్య సమ్మేళనం-2023 లక్ష్యమని నాట్య దీపిక అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర, జి. కనకమహాలక్ష్మి తెలిపారు.

ఘనంగా మహానగర్ పథ సంచలనం

బీచ్‌రోడ్డు: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహానగర్ పథ సంచలనం ఘనంగా జరిగింది. బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి గోకుల్ పార్క్ వరకు వందలాది మంది ఆర్ఎస్ఎస్ సభ్యులు ర్యాలీగా కదిలారు. అనంతరం గోకుల్ పార్క్ వద్ద సభ నిర్వహించారు. పుట్టా శేషు సభను ఉద్దేశించి ప్రసంగించారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

అశ్రునయనాలతో కొండలరావు అంత్యక్రియలు

మధురవాడ: అంతర్జాతీయ మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, ఎన్ఐఎస్ కోచ్ పాలకొండ కొండలరావు అంత్యక్రియలు ఆదివారం మధురవాడలో అశ్రునయనాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పలువురు ప్రముఖులు, క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భార్య సత్యవతి (చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో పీడీ), కుమారులు హేమంత్, దీపక్‌లను పలువురు ఓదార్చారు. వీరిలో పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణరావు, ఒలింపిక్ అసోసియేషన్ వెంకటరావు, కొండలరావు గురువు మోసెస్, స్పోర్ట్స్ అథారిటీకి చెందిన జూన్ గెలెట్, అథ్లెటిక్ కోచ్ అనంతలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీవాత్సవ, అక్కరమాని చినబాబు తదితరులు ఉన్నారు. పలువురు ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారులు, స్థానిక క్రీడాకారులు కొండలరావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పీఎంపాలెం బాబా కళాశాల సమీపంలోని క్రిస్టియన్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



కొండలరావు పార్థివ దేహం వద్ద రోదిస్తున్న భార్య, పిల్లలు, బంధువులు

ఓట్లు కొనేవారి గుండెల్లో రైళ్లు

- రూ.2 వేల నోటు రద్దుపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు

ఎంవీపీకాలనీ: డబ్బులు ఎరగా వేసి ఓట్లు కొనుక్కుందామని అనుకుంటున్న పార్టీలకు రూ.2 వేల నోటు ఉపసంహరణతో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు తెలిపారు. ఆదివారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లధనం పేరుకుపోయిన వారికి తప్పించి.. రూ.2 వేల నోటు ఉపసంహరణ వల్ల సామాన్యులకు ఎలాంటి నష్టం లేదన్నారు.

పెద్ద నోట్ల కారణంగా ఏర్పడే సమస్యలను తాను గతంలోనే ఆర్బీఐకి, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశానని ఆయన గుర్తుచేశారు. ఓటింగ్ శాతం పెరిగితేనే ప్రజాస్వామ్య పర్యవేక్షణ సాధ్యమని తెలిపారు.



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

విస్తృతంగా చార్జిషీట్ : వైఎస్సార్‌సీపీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు బీజేపీ ఆధ్వర్యంలో చార్జిషీట్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన నరేంద్రమోదీ 9 ఏళ్ల సుపరిపాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 29 నుంచి జూన్ 29 వరకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీలో నగదు రూపంలో జరుగుతున్న లిక్కర్ లావాదేవీలపై కేంద్ర సంస్థలు దర్యాప్తు చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.